నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
PM








## 19న శ్రీవారి ఆలయంలో
# బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 23 నుంచి జనవరి 1వ తేదీ వరకూ వైకుంఠ ద్వార దర్శనాన్ని పురస్కరించుకుని ఈ నెల 19న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తితిదే 19న బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. 18న సిఫారసు లేఖలు స్వీకరించడం లేదని వెల్లడించింది.



## మెగా డీఎస్సీకి
# 9,800 పోస్టులు..!
### గత ఆగస్టులో 5,089 ఖాళీలకే నోటిఫికేషన్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) ద్వారా దాదాపు 9,800 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని భావిస్తోంది. మూడున్నర నెలల క్రితం గత ప్రభుత్వం 5,089 పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. పెద్దసంఖ్యలో ఖాళీలు ఉండగా.. తక్కువ పోస్టులకే జారీ చేయడంపై నిరుద్యోగులు అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలోనే హామీ ఇచ్చింది. శుక్రవారం అసెంబ్లీలో గవర్నర్ తమిళిసై ప్రసంగంలోనూ వచ్చే ఆరు నెలల్లో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తారని వెల్లడించారు. ఇప్పటికే గత నోటిఫికేషన్, దరఖాస్తుల ప్రక్రియ, పరీక్షల నిర్వహణపై ఆర్థికశాఖ అధికారులతో విద్యాశాఖ అధికారులు సమావేశమై చర్చించారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ ఖాళీ పోస్టులు సుమారు 9,800 ఉంటాయని విద్యాశాఖ వర్గాలు స్పష్టంచేశాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9,370 ఉపాధ్యాయ ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాల్సి ఉందని గత జులైలో మంత్రివర్గ ఉపసంఘానికి విద్యాశాఖ ఆయా గణాంకాలు సమర్పించింది. అందుకు భిన్నంగా 5,089 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ జారీ అయ్యింది. అంటే 4,281 పోస్టులకు కోత పడింది. రాష్ట్రంలో మొత్తం మంజూరైన ఉపాధ్యాయ పోస్టులు 1,22,386 కాగా.. ప్రస్తుతం 1,03,343 మంది పనిచేస్తున్నారు. అంటే 19,043 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిల్లో స్కూల్ అసిస్టెంట్‌లో 70 శాతం, హెచ్‌ఎం ఖాళీలన్నింటినీ పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాల్సి ఉంటుంది. గత నోటిఫికేషన్ సమయంలోనే పదోన్నతుల ద్వారా 1947 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, 2162 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు(పీఎస్‌హెచ్‌ఎం), మరో 5,870 స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు కలిపి మొత్తం 9,979 భర్తీ చేస్తామని సర్కారు స్పష్టంచేసింది.




## కేటీఆర్ ప్రసంగాన్ని
# అడ్డుకున్న భట్టి, పొన్నం

నాల్గవ రోజు తెలంగాణ అసెంబ్లీ సెషన్లు ప్రారంభమయ్యాయి. ఈ చట్టాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. గవర్నర్ ప్రసంగం ఒక తీర్మానాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి గవర్నర్ ప్రసంగం ముగిసింది. రామ్మోహన్ రెడ్డి చెన్నై ఎమ్మెల్యే వివేక్ ప్రాతినిధ్యం వహించారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సభలో మాట్లాడారు.. ఘనత వహించిన కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ఎలా ఉండేది ? అని సభలో ప్రశ్నించారు. దీనిపై రవాణా, బీసీ సంక్షేమం పొన్నం ప్రభాకర్, డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖ భట్టి విక్రమార్క సభలో ఫైర్ అయ్యారు.

### కేటీఆర్ ఏమన్నారంటే..

ఘనత వహించిన కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ఎలా ఉండేది? అని సభలో ప్రశ్నించారు. ఆకలి కేకలు, పడవు పడ్డ బావులు అన్నారు. 50 ఏళ్ల కాంగ్రెస్ హయాంలో ఏమి జరగలేదన్నారు. నల్గొండలో ఫ్లోరైడ్ బాధలు, దేవర కొండలో గిరిజన బిడ్డల అమ్మకాలు జరగాయన్నారు. కొడంగల్ నుంచి బొంబాయి కు రెండు బస్సులు పోయేవి కాంగ్రెస్ హయాంలో అన్నారు. మహబూబ్ నగర్ నుంచి వలసలు ఉండేవన్నారు. తెలంగాణ పదం నిషేధిస్తే... ఒక్క కాంగ్రెస్ నేత మాట్లాడలేదన్నారు. పదవుల కోసం... పెదవులు మూసిన చరిత్ర కాంగ్రెస్ నేతలదే అని తెలిపారు. మాటి మాటికి మంత్రి ఎందుకు మాట్లాడతారా ? అని ప్రశ్నించారు. భట్టి కూడా ఇంత ఆవేశం పడితే ఎలా? అని ప్రశ్నించారు. వలసలు వాస్తవం.. నెత్తురు పారిన నేల వాస్తవం అన్నారు. 2014 జూన్ లో రేవంత్ మాట్లాడిన మాటలు అన్నారు. మా తండ్రి చనిపోతే దహన సంస్కారం తర్వాత.. స్నానం చేద్దాం అంటే.. కరెంట్ లేదన్నారు. ఇది రేవంత్ మాట్లాడిన మాట అన్నారు. ఇందిరమ్మ పాలన గురించి గుర్తు చేయాలి కదా? అన్నారు. పోతిరెడ్డిపాడు గురించి చెప్పాలన్నారు. ఇందిరమ్మ పెరు అవసరం కోసం వాడతాం అంటే ఎలా? అని ప్రశ్నించారు. తెలంగాణకి కలిసి వచ్చే సమయానికి నడిసి వచ్చే కొడుకు కేసీఆర్ అన్నారు. జూన్ 2 ..2014 లోనే నిర్బంధం పోయిందన్నారు. బానిసకోక బానిస అన్నట్టు.. పీడించిన వాళ్ళ కి వారసులు వాళ్ళు.. 1.5 శాతం ఓటు తేడా మాత్రమే అన్నారు. మిడిసి పడొద్దు ఎక్కువ తేడా లేదన్నారు.

### కేటీఆర్ కు భట్టి విక్రమార్క.. పొన్నం ప్రభాకర్ కౌంటర్..

కేటీఆర్ మాటలకు భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. ప్రజాస్వామ్యయుతంగా సభను నడుపుకుని అని పెద్ద మనసుతో చెప్పామన్నారు. దాడి చేయడం మొదలు పెట్టారు.. .కేటీఆర్ తీరు సరిగ్గా లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో ఎందుకు నీళ్ళు లేవు...వివరాలు చెప్పామంటారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వచ్చిన తర్వాత జనం నీరు తాగలేదా ? అని తెలిపారు. యాభై ఏండ్లలో ఏం చేశారు అంటారన్నారు. 55 ఏండ్ల ఉమ్మడి రాష్ట్ర ము వద్దనే తెలంగాణ వచ్చిందని తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఏం జరిగింది అనేది లెక్క అన్నారు. కేంద్రాన్ని ఒప్పించి.. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అని తెలిపారు. సంపద తో మేము ఇస్తే.. అప్పుల పాలు చేశారన్నారు. అప్పుల రాష్ట్రం గా మార్చింది మీరు అంటూ మండిపడ్డారు. బాగు చేయాల్సింది పోయి..అప్పుల పాలు చేశారన్నారు. పాత ముచ్చటే మాట్లాడటం ఏంటి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షల కోట్లు వృధా చేశారన్నారు. అదనంగా నీళ్లు ఇచ్చారా మీరు అని తెలిపారు. పదేళ్లు విధ్వంసం చేశారన్నారు. స్వేచ్ఛ లేకుండా చేశారు మీరన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. ఉమ్మడి రాష్ట్రం గురించి మాట్లాడితే ఎలా ? అన్నారు. ఉమ్మడి రాష్ట్రం గురించి మాట్లాడితే.. నువ్వు కూడా ఆటే పో.. ఇక్కడ ఎందుకు మరి అంటూ భట్టి ఫైర్ అయ్యారు. ఇక సభలో మరోవైపు కేటీఆర్ కు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. అందుకోసమే తెలంగాణ తెచ్చుకున్నామంటూ సెటైర్ వేశారు. తెలంగాణ తర్వాత ఏమి అయ్యింది చెప్పాలన్నారు. అన్ని విషయాలు తెలంగాణ లో ఏమి అయ్యింది మాట్లాడాలన్నారు.



# న్యూయార్క్‌లో భారత్ X పాక్!
### 2024 టీ20 ప్రపంచకప్


వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్‌లో న్యూయార్క్ వేదికగా చిరకాల ప్రత్యర్థులు భారత్-పాకిస్థాన్ తలపడే అవకాశాలున్నాయి. వెస్టిండీస్-అమెరికా సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ మెగా టోర్నీలో పూర్తి షెడ్యూల్‌ను ఐసీసీ ఇంకా అధికారికంగా ఖరారు చేయలేదు. ఈ కప్‌లో తలపడుతున్న పది జట్లలో కొన్ని జట్లు తమ గ్రూప్ మ్యాచ్‌లన్నీ అమెరికాలో ఆడే అవకాశాలున్నాయి. వీటిలో భారత్, పాకిస్థాన్ ఉండొచ్చని తెలిసింది. భారత్‌కు న్యూయార్క్‌కు మధ్య కాలమానంలో పదిన్నర గంటలు తేడా ఉండడంతో భారత్‌లో అభిమానులకు అనువుగా ఉండేటట్లు ఈ మ్యాచ్‌ను నిర్వహించబోతున్నారు. తుది షెడ్యూల్‌కు ముందు మార్పు చేర్పులు చేసే అవకాశం ఇంకా ఉంది. టోర్నీలో మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చే వెస్టిండీస్, అమెరికాల్లోని వేదికల్లో ఐసీసీ బృందం ఇప్పటికే పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించింది. విండీస్‌లో కొన్ని వేదికలు ఇంకా పూర్తి స్థాయిలో సిద్ధం కావాల్సి ఉంది.



## దేశంలోనే అతిపెద్దదిగా
# అయోధ్య మసీదు
### 2024లో శంకుస్థాపన

అయోధ్యకు 25 కి.మీ.ల దూరంలోని ధన్నీపుర్‌లో దేశంలోనే అతిపెద్ద మసీదును నిర్మించనున్నారు. తాజ్‌మహల్ కంటే అందంగా ఉండేలా ఈ మసీదును సిద్ధం చేయనున్నట్లు మహమ్మద్ బిన్ అబ్దుల్లా మసీదు అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ముంబయికి చెందిన బీజేపీ నేత హాజీ అరాఫత్ షేక్ తెలిపారు. 2024లో నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మసీదుకు మక్కాలోని కాబాలో ప్రార్థనలు చేసే ఇమామ్ సహా పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తామన్నారు. యూపీ ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో మసీదు నిర్మాణం జరగనుంది. 21 అడుగుల ఎత్తు, 36 అడుగుల వెడల్పు ఉండే ప్రపంచంలోనే అతిపెద్ద ఖురాన్‌ను మసీదులో ప్రదర్శనకు ఉంచనున్నట్లు అరాఫత్ షేక్ తెలిపారు. 9 వేలమంది మహిళలు, పురుషులు ఒకేసారి ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా నిర్మిస్తామన్నారు.

# రతన్ టాటాకు బెదిరింపులు..
# ముంబయి పోలీసులు అలర్ట్



ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు బెదిరింపులు రావడం కలకలం రేపింది. ఇటీవల ముంబయి పోలీసు కంట్రోల్ రూమ్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి.. రతన్ టాటా ప్రాణానికి ముప్పు ఉందని హెచ్చరించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. టాటా భద్రతను పెంచాలని.. లేదంటే ఆయనకు కూడా సైరస్ మిస్త్రీలాగే అవుతుందని పేర్కొన్నట్లు తెలిపాయి. ఈ వారం ఆరంభంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు రతన్ టాటా భద్రతను పెంచడంతో పాటు కొన్ని తనిఖీలు కూడా చేపట్టినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. అదే సమయంలో ఆ ఫోన్ కాల్ చేసిన వ్యక్తి గురించి దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక నుంచి ఆ ఫోన్ వచ్చినట్లు గుర్తించి.. వెంటనే అక్కడికి వెళ్లి అతడిని అరెస్టు చేశారు. నిందితుడిని పుణెకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కొద్ది రోజుల క్రితమే ఇంటి నుంచి వెళ్లిపోయిన అతడు.. కర్ణాటక నుంచి ముంబయి పోలీసులకు ఫోన్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడు మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాయి.



# కేసీఆర్ భద్రత
# జడ్ నుంచి వై ప్లస్‌కు కుదింపు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భద్రతను జడ్ కేటగిరి నుంచి వై ప్లస్‌కు తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి 1+4 చొప్పున రెండు షిఫ్టుల్లో కలిపి 2+8 మంది భద్రత సిబ్బంది ఉండనున్నారు. కేసీఆర్ నివాసం వద్ద నిరంతరం గార్డుల కాపలా ఉంటుంది. పరిసరాల్లోనూ మఫ్టీలో సిబ్బంది ఉంటారు. బయటికి వెళ్లినప్పుడు పైలట్ ఎస్కార్ట్ భద్రత యథావిధిగా కొనసాగనుంది. చట్టసభల ప్రతినిధులు మాజీలుగా మారిన అనంతరం భద్రతను కుదించే ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ముఖ్యమంత్రిగా ఎన్నికైన వారికి జడ్ కేటగిరి భద్రత కల్పిస్తారు. తాజా మాజీ ముఖ్యమంత్రికి వై ప్లస్‌కు తగ్గిస్తారు. అదే సమయంలో వీరిద్దరి కంటే ముందు ముఖ్యమంత్రిగా చేసిన వారి భద్రత వై కేటగిరీకి తగ్గుతుంది.



# అరాచకం సృష్టించడానికి కుట్ర

లోక్‌సభలో అలజడి కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనతో దేశంలో అరాచకం సృష్టించడమే నిందితుల అజెండా అని లలిత్ ఝు కస్టడీ పిటిషన్ లో పోలీసులు పేర్కొన్నారు. దేశంలో అలజడి సృష్టించి తద్వారా తమ డిమాండ్లను నెరవేర్చుకోవాలని నిందితులు భావించినట్లు వెల్లడించారు. ఈ దాడి వెనక నిందితులకు ఏమైనా విదేశీ, ఉగ్రవాద సంస్థల నుంచి ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అనే అంశంపై దర్యాప్తును వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసేందుకు దేశంలో అరాచకం సృష్టించాలని భావిస్తున్నట్లు పార్లమెంటు అలజడి ఘటన కీలక సూత్రధారి లలిత్ ఝా వెల్లడించినట్లు కస్టడీ విచారణ సందర్భంగా ఢిల్లీ పోలీసులు పాటియాలా హౌస్ కోర్టుకు తెలిపారు. లోక్‌సభ ఛాంబర్‌లోకి నిందితులు దూకిన ఘటనను రీక్రియేట్ చేసేందుకు ఢిల్లీ పోలీసులు పార్లమెంట్ అనుమతిని కోరే అవకాశం ఉంది.




# LIC ఏజెంట్లకు గుడ్ న్యూస్

ఏజెంట్లకు చెల్లించే గ్రాట్యుటీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) తెలిపింది. ఏజెంట్లు, ఉద్యోగుల సంక్షేమ చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే, ఈ ప్రతిపాదనను ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదించింది.



# విష్ణు ప్రియా బెల్లి అందాలు

టాలీవుడ్ [redacted]స్ లో యంగ్ బ్యూటీ విష్ణుప్రియ ఒకరు. పలు టివి షోలతో విష్ణుప్రియ యువతలో పాపులర్ అయింది. నాజూకైన అందంతో సోషల్ మీడియాలో యువతకు గాలం వేస్తోంది. సుడిగాలి సుధీర్ తో కలసి చలాకీగా యాంకరింగ్ చేస్తూ మెప్పించింది విష్ణుప్రియ. సోషల్ మీడియాలో బోల్డ్ గా గ్లామర్ ఫోజులు ఇవ్వడంలో ఈ యంగ్ బ్యూటీ ఏమాత్రం వెనుకడుగు వేయదు. విష్ణుప్రియ తరచుగా చేసే ఫోటోషూట్స్ కుర్రకారుని నిద్రలేకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం విష్ణు ప్రియా సినిమాల్లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. విష్ణు ప్రియా తరచుగా బెల్లీ డాన్స్ చేస్తూ ఇంటర్నెట్ లో మంటలు పెడుతుండడం చూస్తూనే ఉన్నాం. కుర్రాళ్ళు పిచ్చెక్కిపోయేలా బెల్లి అందాలు చూపిస్తూ విష్ణుప్రియా డాన్స్ చేస్తూ ఉంటుంది.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## 'సలార్'.. 10 నిమిషాల్లో 10 వేల టికెట్లు

ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో గ్లోబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'సలార్' విడుదల కోసం ఫ్యాన్స్ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. తాజాగా కర్ణాటక ప్రాంతంలో ఈ మూవీ టికెట్లు ఓపెన్ చేశారు. అక్కడ టిక్కెట్ బుకింగ్‌ను ఓపెన్ చెయ్యగానే హాట్ కేక్ లాగా టిక్కెట్లు అమ్ముడుపోయినట్లు తెలుస్తోంది. కేవలం 10 నిమిషాల్లోనే పది వేల టిక్కెట్లు అమ్ముడుపోయాయట.



## ఫిబ్రవరిలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్?

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ఫిబ్రవరిలో రావొచ్చని తెలుస్తోంది. జూన్ 16తో ప్రస్తుత లోక్‌సభ గడువు ముగిస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్-మేలో ఎన్నికలు నిర్వహించాలి. కానీ ఎన్నికలను మార్చి-ఏప్రిల్ లో ముగించి, మేలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ అధిష్టానం భావిస్తోందట. దీంతో ఫిబ్రవరి 3వ వారంలో ఎలక్షన్స్ షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.



## పోలీస్‌స్టేషన్‌పై దాడిలో 11 మంది మృతి

ఇరాన్‌లోని ఓ పోలీస్‌స్టేషన్‌పై జరిగిన దాడిలో 11 మంది మృతి చెందగా మరి కొందరు గాయపడ్డారు. శుక్రవారం రాత్రి సమయంలో రాస్క్ నగరంలోని పోలీస్ స్టేషన్‌పై గుర్తుతెలియని వేర్పాటువాద గుంపు కాల్పులకు తెగబడింది. ఈ ఘటనలో సీనియర్ పోలీసు అధికారులు, సైనికులు ప్రాణాలు కోల్పోయారని, పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో పలువురు దుండగులు కూడా మృతి చెందారని సిస్టాన్, బలూచిస్థాన్ ప్రావిన్స్ డిప్యూటీ గవర్నర్ పేర్కొన్నారు.



## విశాఖలో మెట్రో రైలుకు గ్రీన్ సిగ్నల్

విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టుకు ఎపి క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖను రాష్ట్ర పరిపాలనా రాజధానిగా మార్చబోతున్న నేపథ్యంలో ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించింది. తొలి విడతలో 76.90 కిలో మీటర్ల మేర లైట్ మెట్రో నిర్మాణానికి సిద్ధమైంది. కేవలం డీపీఆర్ ను ఆమోదించడమే కాకుండా వచ్చే ఏడాది జనవరి 15న మెట్రో రైలు పనులకు శంకుస్థాపన చేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది.




## సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష తేదీ మార్పు..

దేశవ్యాప్తంగా సైనిక పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఇచ్చిన షెడ్యూల్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం(2024-25)లో ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశాలకు ఆలిండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (AISSEE 2024) దరఖాస్తులకు గడువు శనివారంతో ముగియనుండంతో ఆ గడువును పొడిగించారు. గతంలో డిసెంబర్ 16 వరకు దరఖాస్తులకు గడువు ఉండగా.. దాన్ని డిసెంబర్ 20 వరకు ఎన్టీఏ పొడిగించింది. అలాగే, ఈ పరీక్ష తేదీని జనవరి 21 నుంచి జనవరి 28(ఆదివారం)కి మార్పు చేసింది. పరీక్ష ఫీజును డిసెంబర్ 20 రాత్రి 11.50గంటల వరకు చెల్లించవచ్చని తెలిపారు. దరఖాస్తుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే డిసెంబర్ 22 నుంచి 24వ తేదీ వరకు సవరించుకొనేందుకు అవకాశం కల్పించారు. పూర్తి సమాచారం https://exams.nta.ac.in/AISSEE/ లో తెలుసుకోవచ్చు.



## అయ్యప్ప భక్తులతో రైళ్లు కిటకిట!

శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులతో పాటు ఉపాధి నిమిత్తం కేరళ వెళ్లే వారితో పలు రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. విశాఖ మీదుగా నిత్యం రాకపోకలు సాగించే బొకారో ఎక్స్‌ప్రెస్‌కు రోజురోజుకు ప్రయాణికుల తాకిడి పెరుగుతోంది. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆ రైలుకు ఒక థర్డ్ ఏసీ బోగీని జత చేశారు. అయితే స్లీపర్, సాధారణ బోగీలు తగ్గించడంతో సాధారణ ప్రయాణికులకు కనీసం నిలబడే అవకాశం లేకుండా పోతోంది. దీంతో నిత్యం నరకయాతన పడుతున్నారు.



# అప్పులకన్నా.. ఆస్తులే ఎక్కువ.!

# రూ. 1.37 లక్షల కోట్ల

# ఆస్తులు సృష్టించాం..


### బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్

తెలంగాణ బలి దేవత ఎవరో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్. బలిదానం, నియంతృత్వం గురించి కాంగ్రెస్ మాట్లాడం హాస్యాస్పదంగా ఉందని దుయ్యబట్టారాయన. కాంగ్రెస్ పాలనలో కరెంట్ షాక్‌తో 8వేలపైనే రైతులు చనిపోయారని విమర్శించారు. విద్యుత్ శాఖ 85 వేల కోట్ల అప్పులో ఉందని అసత్య ప్రచారం చేస్తున్నారన్న కేటీఆర్.. 2014కు ముందు ట్రాన్స్‌కో, జెన్‌కోకు అప్పులు ఉన్నాయని.. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత డిస్కంల ఆస్తులు రెట్టింపు చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. విద్యుత్ ఆస్తుల విలువు రూ. 1.37 లక్షల కోట్లు కాగా.. విద్యుత్ శాఖలో అప్పులకన్నా.. ఆస్తులే ఎక్కువ ఉన్నాయని స్పష్టం చేశారు. తలసరి విద్యుత్ వినియోగంలో దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దామని.. విద్యుత్ సబ్ స్టేషన్లను గణనీయంగా పెంచింది తమ ప్రభుత్వమేనని అన్నారు కేటీఆర్. విద్యుత్ వినియోగం కూడా అభివృద్ధికి కొలమానం అని చెప్పకొచ్చారాయన. మోటర్లకు మీటర్లు పెట్టం అని తెగేసి చెప్పాం.. మరి కాంగ్రెస్ మోటర్లకు మీటర్లు పెట్టమని చెబుతుందా? అని ప్రశ్నించారు కేటీఆర్. వ్యవసాయం, గృహాలు, పరిశ్రమలకు 24 గంటల కరెంటు ఇవ్వాలన్నారు. సివిల్ సప్లై శాఖలో 56 వేల కోట్ల అప్పులు ఉన్నాయని.. నిన్న గవర్నర్ తమిళిసై చెప్పారన్న కేటీఆర్.. రాష్ట్రం దివాలా తీయలేదు.. దివాలకోరు రాజకీయాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. అప్పు అంటారు గానీ.. ఆస్తుల గురించి ఎందుకు చెప్పట్లేదని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తమ పాలనలో రాష్ట్రానికి అప్పుల కంటే ఆస్తులు ఎక్కువ సమకూరాయని కేటీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు.



## అంతరించిపోతున్న కశ్మీర్ జింకలు..

కశ్మీర్ వ్యాలీలో ఉండే అరుదైన వన్య ప్రాణిగా గుర్తింపు ఉన్న రెడ్ స్టాగ్ జింకలపై హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ పరిశోధన చేసింది. అయితే, జింకల జనాభా, జీవావరణం, సంతతిని పెంచే పలు అంశాలపై శాస్త్రీయంగా విశ్లేషించారు. కశ్మీర్ లోయలోని చీనాబ్ నదీ తీరంలో ఎక్కువగా ఈ జింకలు సంచరిస్తాయి.. వీటిపై సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ అనురాధారెడ్డి నేతృత్వంలో పరిశోధన జరిపారు. జమ్ములోని దాచిగాం జాతీయ పార్కులో వీటిని సంరక్షిస్తున్నారు.. కాగా, 1990లో వీటి సంఖ్య 5 వేలుగా ఉండేదని వారు గుర్తించారు. అయితే, వీటి సంతాన ఉత్పత్తికి అవసరమైన మగ జింకల సంఖ్య మాత్రం కేవలం 12 లోపే ఉందని సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ అనురాధారెడ్డి తేల్చారు. 14 మైక్రో శాటిలైట్ మేకర్ల ద్వారా 293 రెడ్ స్టాగ్ మల వ్యర్థాలను పరిశోధించి వాటి జన్యు క్రమాన్ని బట్టి ఎన్ని రెడ్ స్టాగ్ మగ జింకలు ఉన్నాయనేది వారు తేల్చారు. రుతుక్రమాలకు అనుగుణంగా వలస వెళ్లే ఈ జాతి జింకలు లోతట్టు, కొండ ప్రాంతాల్లోనే నివాసం ఉంటాయి.. ఇక, వీటిని ఇదే సమయంలో ఎక్కువగా సంతానోత్పత్తి చేస్తుంటాయని వారు పరిశోధనలో పేర్కొన్నారు. అయితే, వీటి సంపర్కం కూడా సెప్టెంబర్-నవంబర్ మధ్యలో ఎక్కువగా ఉంటుందని వెల్లడించారు. తమ పరిశోధన ద్వారా రెడ్ స్టాగ్ జింకల సంతానోత్పత్తిని పెంచడానికి వీలు పడుతుందన్నారు. ఈ జింకలు అంతరించిపోకుండా వాటిని కాపాడుకోవచ్చని సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ సైంటిస్టులు తెలిపారు. ఇక, సీసీఎంబీ సైంటిస్టులు చేసిన పరిశోధనలను కేంబ్రిడ్జి ప్రెస్ జర్నల్ ప్రచురించింది.



## సీఎం జగన్‌కు మళ్లీ తెలంగాణ హైకోర్టు నోటీసులు

అక్రమాస్తుల కేసుల విచారణలో జాప్యంపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో ఏపీ సీఎం జగన్‌కు తెలంగాణ హైకోర్టు శుక్రవారం మరోసారి నోటీసులు జారీచేసింది. దర్యాప్తు సంస్థకూ నోటీసులిచ్చింది. గతంలో జారీచేసిన నోటీసులు అందకపోవడంతో ఈ చర్య తీసుకుంది. జగన్‌పై నమోదైన సీబీఐ, ఈడీ కేసులను 2024 ఎన్నికల్లోగా తేల్చేలా ఆదేశాలివ్వాలంటూ మాజీ ఎంపీ, కాపు సంక్షేమసేన వ్యవస్థాపక అధ్యక్షుడు హరిరామ జోగయ్య తెలంగాణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. నేరచరిత్ర లేని నేతను ఎన్నుకోవాలని ప్రజలు అనుకుంటున్నారని పేర్కొన్నారు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నా.. ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రస్తుతం జగన్ సీఎం అయ్యారన్నారు. ఈ పిటిషన్‌పై విచారించిన ధర్మాసనం నవంబరు 8న ప్రతివాదులైన జగన్‌కు, సీబీఐకి నోటీసులు జారీచేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, టి.వినోద్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది పోలిశెట్టి రాధాకృష్ణ వాదనలు వినిపిస్తూ ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీచేసినా న్యాయవాదులెవరూ హాజరుకాలేదని తెలిపారు. అనుమతిస్తే వ్యక్తిగతంగా నోటీసులు అందజేస్తానని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ కోర్టు జారీ చేసిన నోటీసులు అందకపోవడంతో మరోసారి జారీ చేస్తామని, వ్యక్తిగత నోటీసులు అందజేయాల్సిన అవసరం లేదని పేర్కొంది.

## తెలంగాణ హైకోర్టుకు ఏపీ సీఐడీ క్షమాపణలు

కఠిన చర్యలు తీసుకోరాదంటూ మధ్యంతర ఉత్తర్వులు ఉన్నప్పటికీ మార్గదర్శి ఎండీ సీహెచ్.శైలజా కిరణ్‌కు వ్యతిరేకంగా లుకౌట్ సర్క్యులర్ (ఎల్వోసీ) జారీ వ్యవహారంపై ఏపీ సీఐడీ (AP CID) అధికారులు శుక్రవారం తెలంగాణ హైకోర్టుకు క్షమాపణ లేఖలను అందజేశారు. మార్గదర్శి ఎండీకి ఎల్వోసీ జారీలో కోర్టు ఉత్తర్వుల పట్ల ఎలాంటి అవిధేయత లేదని పేర్కొంటూ అదనపు డైరెక్టర్ జనరల్ ఎన్.సంజయ్, అదనపు ఎస్పీ ఎస్.రాజశేఖర్‌రావు, డిప్యూటీ ఎస్పీ సీహెచ్.రవికుమార్ వేర్వేరుగా క్షమాపణ లేఖలను అందజేశారు. వాటిని అంగీకరించాలని కోరారు. ఎల్వోసీ జారీ చేసిన విషయంలో మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, ఆ సంస్థ ఎండీ శైలజా కిరణ్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌లపై శుక్రవారం జస్టిస్ కె.సురేందర్ విచారణ చేపట్టారు. అధికారులు సమర్పించిన క్షమాపణ లేఖలను సీఐడీ తరఫు న్యాయవాది అందజేశారు. వాటిని పరిశీలించిన న్యాయమూర్తి అఫిడవిట్ దాఖలు చేయకుండా లేఖలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. క్షమాపణను అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని సీఐడీ అధికారులను ఆదేశిస్తూ విచారణను ఈనెల 29కి వాయిదా వేశారు.






# హాట్ లుక్‌లో పాయల్

సాధించింది. ఆర్‌ఎక్స్ 100లో పాయల్ నెగిటివ్ షేడ్స్ తో కూడిన బోల్డ్ రోల్ చేసింది. శృంగార సన్నివేశాల్లో రెచ్చిపోయి నటించింది. పాయల్ రాజ్ పుత్ గ్లామర్ కి కుర్రాళ్ళు ఫిదా అయ్యారు. జయాపజయాలతో సంబంధం లేకుండా ఆమెను ఆరాధించే ఫ్యాన్స్ ఉన్నారు.ఆర్‌ఎక్స్ 100 రేంజ్ హిట్ మరలా ఆమెకు పడలేదు. దీంతో కెరీర్ గ్రాఫ్ పడిపోతూ వచ్చింది. ఆర్డీఎక్స్ లవ్ పేరుతో మరో బోల్డ్ మూవీ చేసింది. అది బాక్సాఫీస్ వద్ద వర్క్ అవుట్ కాలేదు. దర్శకుడు బాబీ తెరకెక్కించిన వెంకీ మామ చిత్రంలో పాయల్ వెంకీకి జంటగా నటించింది. నాగ చైతన్య-రాశి ఖన్నా మరో జంటగా నటించారు. వెంకీ మామ చేయకుండా ఉండాల్సిందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాయల్ అన్నారు. ఇటీవల పాయల్ ఆశలన్నీ మంగళవారం మూవీతో ప్రేక్షకులను పలకరించింది. ఆర్‌ఎక్స్ 100 దర్శకుడితో పాయల్ మరోసారి చేయి కలిపింది. కాగా చాలా కాలంగా పాయల్ రాజ్ పుత్ సౌరభ్ దింగ్రా అనే వ్యక్తిని ప్రేమిస్తుంది.